

Visit us @ http://epaper.suryaa.com

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

నిజామాబాద్

కామారెడ్డి

మంగళవారం, 02 జూలై 2024

పేజీలు : 02


## పాముకాటుతో గిరిజన మహిళ మృతి

లింగంపేట్, జులై 01, సూర్య మేజర్ న్యూస్

లింగంపేట్ మండలంలోని కన్నాపూర్ తాండకు చెందిన నూనావత్ జైన (42) అనే మహిళ పాము కాటుతో మృతి చెందినట్లు తాండవాసులు తెలిపారు. ఆదివారం తన వ్యవసాయ పొలంలో నాటు వేసి రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా కాలుకు మంటలేవడంతో నిద్రలేచి పరిసర ప్రాంతాల్లో చూసేసరికి కట్లపాము కనిపించిందని దానిని వెంటనే తాండ వాసులు చంపివేసి చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ జైన మృతి చెందిందని చెప్పారు. ఆమె మృతితో తాండలో విషాదఛాయలు నెలకొన్నాయి.



## ఎడపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులకు సన్మానం.

ఎడపల్లి జులై 1, సూర్య మేజర్ న్యూస్

ఎడపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యుల దినోత్సవం సందర్భంగా ఎడపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెడికల్ ఆఫీసర్ షా.ఇ సా. ఫిర్దోస్, ఆయుష్ విభాగం వైద్యాధికారి వెంకటేష్, డాక్టర్ స్వాతిక లకు సన్మానం చేయడం జరిగింది. అలాగే ఆసుపత్రి లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎడపల్లి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ గండి మనోజ్ మాట్లాడుతూ రోగులకు ఆపద సమయంలో సేవలందిస్తూ, రోగుల పట్ల ఎల్లవేళలా సేవలందిస్తున్న వైద్యులందరికీ వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడపల్లి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ గండి మనోజ్, సెక్రటరీ ఎన్.రాకేష్ వర్మ, కోశాధికారి గంగారెడ్డి,లయన్స్ జిల్లా కోఆర్డినేటర్ సూర్యనారాయణ, లయన్స్ జిల్లా మే%శీ%బర్ మెర్సీ,లయన్స్ ప్రతినిధులు కదం ప్రకాష్ రావు, బంజ శంకర్, నార్ల కాశీనాథ్ గుప్త,వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాలో యాక్ట్ 30 అమలు : జిల్లా ఎస్పీ సింధు శర్మ

కామారెడ్డి బ్యూరో, సూర్య మేజర్ న్యూస్, జూలై 01

కామారెడ్డి జిల్లాలో యాక్ట్ 30 అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ సింధు శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని జూలై 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు జిల్లా కేంద్రంతో పాటు జిల్లా వ్యాప్తంగా 30, 30ఏ పోలీస్ యాక్ట్ 1861 లో ఉంటుందని కామారెడ్డి జిల్లా ఎస్పీ సింధూ శర్మ తెలిపారు. దీని ప్రకారం పోలీస్ అధికారులు అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. అలాగే ప్రజాధనాన్ని నష్టం కలిగించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టారదని ఎస్పీ హెచ్చరించారు. కావున జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల ప్రతినిధులు, నాయకులు తమకు ఈ విషయంలో పోలీసులతో సహకరించాలని ఆమె కోరారు.



## ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు సంతృప్తికరం: జిల్లా ఉపవైద్యాధికారి



బిక్కనూర్, జూలై 01 సూర్య మేజర్ న్యూస్

మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని, జిల్లా ఉపవైద్యాధికారి శోభారాణి మండల వైద్యులను అభినందించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చే రోగుల ఓపి రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రికి రోగుల సంఖ్య పెరగడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో 100% ప్రసవాలు చేసే విధంగా ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి కృషి చేయాలన్నారు. వర్షాకాలం సందర్భంగా సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలను అప్రమత్తం చేసి ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి యెమిమా, స్టాఫ్ నర్స్ చైతన్య, ఆరోగ్య సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

## నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై కామారెడ్డి పోలీసుల తనిఖీలు




కామారెడ్డి జిల్లా ప్రతినిధి, సూర్య మేజర్ న్యూస్, జూలై 01

కామారెడ్డి పట్టణంలో సోమవారం రోజు కామారెడ్డి ఎస్ హెచ్ ఓ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కామారెడ్డి ఎస్ఐ, ఇతర సిబ్బందితో కలిసి కామారెడ్డి పట్టణంలోని జీవధాన్ హాస్పిటల్ దగ్గర స్పెషల్ వెహికల్ చెకింగ్ వాహనాల తనిఖీలు చేపట్టడం జరిగింది. నెంబర్ ప్లేట్ లేని వాహనాలను, సరైన పద్ధతిలో నెంబర్ ప్లేట్లు పెట్టకుండా ఉన్న 29 వాహనాలను సీజ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ హెచ్ ఓ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ., వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించి, సరైన పద్ధతిలో నెంబర్ ప్లేట్లు ధరించాలని, లేకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయని తెలియజేశారు. వాహనదారులు డ్రంక్ అండ్ డ్రైవ్ చేయడం చట్టరీత్యా నేరమని అన్నారు. అంతే కాకుండా ట్రిబుల్ రైడింగ్, అతివేగం వంటి వాటిపై తనిఖీలు చేసి వాహనాలను సీజ్ చేస్తామని ఆయన అన్నారు. కనుక పట్టణ ప్రజలుగమనించి వాహనాలకుసంబంధి చినపత్రాలు ,హెల్మెట్ధరించి వాహనాలునడిపిస్తే ప్రమాదాలు జరగ కుండా ఉంటాయని ఆయన తెలిపారు. ఈ విషయాన్నిప్రజలు గమనిం చాలన్నారు.



## మండల కేంద్రానికి చెందిన వ్యక్తి అదృశ్యం.. మిస్సింగ్ కేసు నమోదు

బిక్కనూర్, జూలై 01, సూర్య మేజర్ న్యూస్

మండల కేంద్రానికి చెందిన తాటిపాముల శేఖర్ గౌడ్ (47) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై సాయికుమార్ చెప్పారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత నెల 29వ తేదీ పట్టణంలో ప్రింటింగ్ ప్రెస్ నడిపించే శేఖర్ గౌడ్ శనివారం ఇంటి నుండి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు షాపు వద్దకు వెళ్లి చూడగా, షాపు వద్ద ద్విచక్ర వాహనాన్ని పెట్టి వెళ్లారు. ఫోను స్విచ్ ఆఫ్ రావడంతో మూడు రోజులుగా కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో బంధువుల ఇళ్లలో వెతికిన ఆచూకీ లభించకపోవడంతో శేఖర్ గౌడ్ భార్య లత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికుమార్ చెప్పారు.



## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులకు సన్మానం.

బీర్కూర్, జూలై 1, సూర్య మేజర్ న్యూస్.

బీర్కూర్ మండల కేంద్రములో వైద్యుల దినోత్సవం సందర్భంగా బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బీర్కూర్ పీహెచ్ సి వైద్యాధికారి గిరీష్ కుమార్ తో పాటు స్థానిక ఆర్ఎంపి, పిఎంపి రమేష్, బాలకృష్ణ, నాగేశ్వరరావు, రాచప్ప లకు సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా బీర్కూర్ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మేకల గాలయ్య మాట్లాడుతూ., రోగుల పట్ల ఎల్లవేళలా సేవలందిస్తున్న వైద్యులందరికీ వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్ ఛైర్మెన్ శ్రీనివాస్, లయన్స్ క్లబ్ సభ్యులు విఠల్, రవీందర్ జెట్టి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఆర్టీసి బస్సు డీ. ఒకరి మృతి.

బాన్సువాడ, జూలై 1, సూర్య మేజర్ న్యూస్

నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం మోస్రా మండలం గోవూర్ వద్ద సోమవారం రోజున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో సాయికిరణ్ (18) ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, రుద్రూర్ మండలం చిక్కడపల్లి గ్రామానికి చెందిన సాయికిరణ్ తన బంధువును పల్లె వెలుగు బస్సులో ఎక్కించి, తిరిగి బాన్సువాడ వైపు వస్తున్న సమయంలో ఆర్టీసీ బస్ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలు పాలైన క్షత గాత్రుడిని చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా మార్గమధ్యలో మృతి చెందాడు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే నిండు ప్రాణం బలైందని స్థానికులు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్స్ డే

బీబీపేట్ మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి లో సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో డాక్టరు భానుప్రియను డివిజన్ ఎంసి సభ్యుడు, హెల్త్ అసిస్టెంట్ వినోద్ కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాంతక కరోనా మహమ్మారి మానవాళిపై విరుచుకుపడ్డప్పుడు డాక్టర్లు చేసిన సేవలు విస్మరించ లేనివని అన్నారు. పేషంట్లు వైద్యుల పట్ల బలమైన విశ్వాసాన్ని కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఎచ్ఓ ప్రమీల, పిఎచ్ఎన్ సంఘమణి, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



## ఎంపీపీ వైఖరికి నిరసనగా నేటి సమావేశాన్ని బహిష్కరిస్తున్నాం

బిక్కనూర్, జూలై 01, సూర్య మేజర్ న్యూస్:

ఎంపీపీ గాల్ రెడ్డి వైఖరికి నిరసనగా నేడు మంగళవారం నిర్వహించే చివరి మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దాయారి సాయి రెడ్డి చెప్పారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రేపు మండల సర్వసభ్య సమావేశానికి రాజ్యాంగబద్ధమైన హోదా లేని షబ్బీర్ అలీని ప్రత్యేక ఆహ్వానితునిగా ఎలా ఆహ్వానిస్తారని, ఎంపీపీని ఎన్నుకున్న ఎంపీటీసీ సభ్యులను కాదని ఒంటెద్దు పోకడలకు పోతున్న ఎంపీపీ గాల్ రెడ్డి వైఖరిని నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీకి చెందిన జడ్పీటీసీ, ఏడుగురు ఎంపీటీసీలు, నలుగురు సింగిల్ విండో సొసైటీ చైర్మన్లు సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు చెప్పారు. గతంలో నాలుగున్నర సంవత్సరాల పాటు బిఆర్ఎస్ పార్టీలో ఎంపీపీగా కొనసాగిన గాల్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ను మండల సమావేశానికి ఎప్పుడైనా ఆహ్వానించారా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుడిసె యాదగిరి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దాయారి సాయిరెడ్డి, రామేశ్వర్ పల్లి సొసైటీ చైర్మన్ నాగర్తి భూమి రెడ్డి, తిప్పాపూర్ సొసైటీ చైర్మన్ ఏనుగు వెంకట్ రెడ్డి, అంతంపల్లి సింగిల్ విండో సొసైటీ చైర్మన్ వలకొండ వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ తునికి వేణు, నాయకులు అత్తిలి శ్రీనివాస్, సరస్వతి ప్రభాకర్, బాల గౌడ్ ఉన్నారు.



## రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

సదాశివనగర్, జూలై 1, సూర్య మేజర్ న్యూస్

సదాశివనగర్ మండలంలోని ధర్మారావుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు కుమ్మరి అభిలాష్, గైని రక్షిని, సుంకరి సంజన, మల్లారి రియశ్రీ, కారంకంటి అఖిల లు శనివారం జరిగిన రాష్ట్రస్థాయి తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు ఏంపికయ్యారు. ఈ ఎంపికకు సలహాలు, సూచనలు ఇచ్చిన ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్, ప్రాథమిక పాఠశాల పి ఈ టి అఫ్రోజ్, విద్యార్థులకు ప్రాథమిక పాఠశాల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.సదాశివ్, పి.మధుక్రిష్ణ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## పాఠ్య పుస్తకాల పంపిణీ.

బీర్కూర్, జూలై 1, సూర్య మేజర్ న్యూస్

బీర్కూర్ ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో ఎంపీపీ రఘు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ., బాగా చదువుకొని ప్రతి ఒక్క విద్యార్థి ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆయన అన్నారు. ఆయనతో పాటు ఎంపీటీసీ సభ్యుడు సందీప్ కో ఆప్షన్ సభ్యుడు అరిఫ్, కాంగ్రెస్ నాయకులు బస్వరాజ్, శశికాంత్, యామ రాములు, దుంపల రాజు ఉన్నారు.



## సైబర్ నేరాలపై అవగాహన..

రాజంపేట జూలై 1 సూర్య మేజర్ న్యూస్

రాజంపేట మండల కేంద్రంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సును పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ., ఫోన్లో ఓటీపీ చెప్పవద్దని ఏఎస్ఐ గంగిరెడ్డి అన్నారు. మీకు బ్యాంకు నుండి ఫోన్ చేస్తున్నాము. డబ్బులు మీ అకౌంట్లో జమవుతాయి. ఓటిపి చెప్పండి అని కాల్ చేసిన వారికి ఓటీపీలు, ఆధార్ కార్డు నెంబర్ చెప్పవద్దని పోలీసులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు.

బీర్కూర్, జూలై 1, సూర్య మేజర్ న్యూస్.

బీర్కూర్ పీ హెచ్ సి లో అమ్మఒడి కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గర్భిణులకు ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి గిరీష్ కుమార్ తో పాటు ఎంఎల్ హెచ్ పీలు ప్రీతి, నరేందర్, రమ్యశ్రీ ఉన్నారు.